సాక్షి కృష్ణాజిల్లా

7

గురువారం । 31 । అక్టోబర్ । 2024



ఉమ్మడి కృష్ణాజిల్లా హాకీ జట్ల ఎంపిక

పమిడిముక్కల: ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికల హాకీ జట్లను బుధవారం పమిడిముక్కల హైస్కూల్లో ఎంపిక చేశారు.

-8లో▸



ఆకట్టుకున్న ఎస్డీఆర్ఎఫ్ మాక్‌డ్రిల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎస్డీఆర్ఎఫ్ వారు బుధవారం పున్నమిఘాట్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. నదిలో మునిగిపోతున్న వ్యక్తిని కాపాడే ప్రక్రియను ప్రదర్శించారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



చిలకలపూడి (మచిలీపట్నం): కృష్ణా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ బాలాజీ తనిఖీ చేశారు. బందోబస్తును పరిశీలించి సీసీ కెమెరాల పుటేజీలను తిలకించారు.

న్యూస్‌రీల్

సరోగసీ దరఖాస్తుల పరిశీలన



లబ్బీపేట(విజయవాడతూర్పు): సరోగసి విధానం(అద్దె గర్భం) కోసం దంపతులు చేసుకున్న దరఖాస్తులను బుధవారం నిర్వహించిన సరోగసీ యాక్ట్ జిల్లా బోర్డు సమావేశంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో ఐదుగురు దరఖాస్తు చేసుకోగా, వారి అర్హతలు, ఇతర అంశాలను వైద్య నిపుణులు పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సౌజన్య, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పరుచూరి అనిల్‌కుమార్, గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.షర్మిల, నేషనల్ హెల్త్ మిషన్ డీపీఎంఓ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల బాస్కెట్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన వెంకట అనిరుధ్, కోవెల గణేష్, శ్రీకర్ ప్రసాద్, క్రాంతిరుద్ర, తిరుమల వీరరాఘవరావు, నిహాంత్‌బాబు, వెంకటసాయి కమల్‌నాథ్, జాకబ్‌రాజు, సుధీర్‌కుమార్, మనోజ్, అహ్మద్‌ఖాన్, పవన్‌కల్యాణ్ జట్టులో చోటు దక్కించుకున్నారన్నారు. నవంబర్ ఒకటి నుంచి ఐదో తేదీ వరకు బెంగళూరులోని క్రైస్ట్ వర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. జట్టు బృందాన్ని వర్సిటీ వీసీ డాక్టర్ డి.వి.ఎస్.ఎల్.నరసింహం, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికరెడ్డి వర్సిటీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్పుకు అధ్యయనం చేయండి

అధికారులకు కృష్ణా కలెక్టర్ ఆదేశం

చిలకలపూడి(మచిలీపట్నం): డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునే విధానంలో లోటుపాట్లపై అధ్యయనం చేసి వాహనదారులకు ఎంత ప్రయోజనకరమో పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్పు చేయడానికి అయ్యే వ్యయం తదితర ప్రయోజనాలపై చెన్నై నుంచి వచ్చిన కంపెనీ ప్రతినిధులు బుధవారం కలెక్టరేట్‌లో ఆటోలను ప్రదర్శించి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పాత డీజిల్ ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్పు చేసేందుకు అయ్యే వ్యయాన్ని బ్యాంకుల ద్వారా రుణాలు అందించటం, మార్పు చేసిన తరువాత వాహనాల మైలేజీ ప్రయోజనకరమైనదా, అవసరమైన చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవకాశాలు తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాలన్నారు. సాధారణంగా విద్యుత్ వాహనాల వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజీ వచ్చే అవకాశం ఉందని, ఈ విషయంపై ఆటోవాలాలకు అవగాహన కల్పించటం ద్వారా వారి జీవనోపాధి మెరుగుపరచడానికి వీలవుతుందని కలెక్టర్ రవాణాశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి జి.మనీష, మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు టీవీఎస్ సుబ్బారావు, సిద్ధిఖ్, బీఎస్ఎస్ నాయక్, సోనీ ప్రియ, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో నటుడు రఘుబాబు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ప్రముఖ సినీ నటుడు రఘుబాబు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన రఘుబాబును ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం మహామండపం రాజగోపురం వద్దకు విచ్చేసిన రఘుబాబుతో పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది, ఫొటోలు, సెల్ఫీలు దిగారు.


గ్యాస్ తుస్..!

ఆధార్, బియ్యం కార్డు, గ్యాస్ కనెక్షన్‌లో లింక్ ఉన్నవారికే పథకం

ఎన్నికల సమయంలో కూటమి చేసిన వాగ్దానాలను అధికారం లోకి వచ్చాక నీరుగార్చే యత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ వాగ్దానాలన్నీ తుస్సుమనిపిస్తున్నారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు, రూ.3 వేల నిరుద్యోగ భృతి ఊసే లేదు. స్కూలుకు వెళ్లే విద్యార్థికి రూ.15 వేలు గురించి మాటే లేదు. రైతుకు ఆర్థిక సాయం అసలే లేదు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 సాయం సంగతి అటకెక్కించినట్టే. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచో స్పష్టత లేదు. ఇక ఏమీ చేయకపోతే బాగోదన్నట్టు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు దీపావళి కానుకగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది కూడా ప్రతి ఇంటికీ కాకుండా బియ్యం కార్డు, ఆధార్‌తో లింకు పెట్టి తుస్సుమనిపించింది.



- ఎన్నికల ముందు ప్రతి ఇంటికీ ఏటా మూడు సిలిండర్లు ఫ్రీ అంటూ కూటమి హామీ
- అధికారంలోకి వచ్చిన నాలుగున్నర నెలలకు బుకింగ్స్ ఆరంభం
- ముందుగా డబ్బు చెల్లించాక.. నిబంధనల మేరకు నగదు బదిలీ
- మార్చి 31వ తేదీ వరకు బుక్ చేసుకునే అవకాశం
- 6.14 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు
- జిల్లాలో 5.33 లక్షల మందికి బియ్యం కార్డుదారులు



సూపర్ సిక్స్
- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం. నుంచి 59 సం. వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

సూపర్ సిక్స్ మేనిఫెస్టో

సాక్షి, మచిలీపట్నం: 'ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితం'.. హామీతో ఊదరగొట్టి, ఓటర్లను ఆకర్షించిన కూటమి నేతలు ఆచరణలో మాత్రం మెలిక పెట్టారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఈ హామీని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి, తమ ప్రభుత్వం వస్తే ప్రతి ఇంటికీ ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నర నెలలకు ఎట్టకేలకు ఆచరణలో పెడుతున్నారు. అయితే 'ప్రతి ఇంటికి' అనే మాట పక్కన పెట్టి.. నిబంధనలు విధించారు. బియ్యం కార్డు, ఆధార్‌తో లింకు పెట్టారు. పైగా ముందుగా బుకింగ్ చేసుకుని, డెలివరీ సమయంలో డబ్బు చెల్లిస్తే.. ఆ తరువాత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాతో జమ చేసేలా ఏర్పాట్లు చేశారు. దీపావళి కానుకగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పి.. బుకింగ్స్ ఆరంభించారు. అయితే, ప్రభుత్వ నిబంధనలతో అనేకమంది లబ్ధిదారులకు ఈ పథకం అందని ద్రాక్షలా మారనుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికీ మూడు సిలిండర్లు అందజేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రారంభమైన బుకింగ్స్

ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఈ నెల 29వ తేదీ నుంచే బుకింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీపావళి కానుకగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో సంబంధిత ఏజెన్సీల్లో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ కోసం నమోదు చేసుకోవాలి. ఈ ఏడాదిలో బుకింగ్ అవకాశం 2024 మార్చి 31వ తేదీ వరకు ఉండగా నమోదు చేసుకున్న లబ్ధిదారులకు మార్చిలోగా సిలిండర్ అందజేస్తారు. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రతి నాలుగు నెలలకోసారి ఓ సిలిండర్ సొమ్ము జమ చేస్తారు. ఏప్రిల్ - జూలై మధ్య ఒకటి, ఆగస్టు - నవంబరు మధ్య రెండోది, డిసెంబరు - మార్చి మధ్య మూడో సిలిండర్ చొప్పున అందిస్తారు. అభ్యంతరాలు, సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1967 కు కాల్ చేసే అవకాశం కల్పించారు.

జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ల వివరాలు

6,17,792 మొత్తం గ్యాస్ కనెక్షన్లు	1,65,497 దీపం కనెక్షన్లు
2,44,971 సింగిల్ కనెక్షన్లు	1,89,365 డబుల్ కనెక్షన్లు
17,959 ప్రైమ్ మినిస్టర్ ఉజ్వల యోజన	5.33 లక్షలు జిల్లాలో బియ్యం కార్డుదారులు

నిబంధనలివీ...

ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు పలు నిబంధనలు విధించారు. ముఖ్యంగా గ్యాస్ కనెక్షన్ తప్పని సరిగా యాక్టివ్‌లో ఉండాలి. ఈ కనెక్షన్‌తో ఆధార్ కార్డు, బియ్యం కార్డు నంబర్‌తో పాటు బ్యాంక్ ఖాతా నంబర్, సెల్ ఫోన్ నంబర్ లింక్ అయి ఉండాలి. ఈ–కేవైసీ తరహాలో ఈ ప్రక్రియ పూర్తయిన వారికే పథకం ప్రతి ఫలం అందనుంది.

ప్రతి ఒక్కరికీ ఉచిత గ్యాస్ సరఫరా చేయాలి



కూటమి ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలి. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా, ముందుగా డబ్బు చెల్లించాలనే నిబంధన లేకుండా సరఫరా చేయాలి.

– మరియమ్మ, గృహిణి, నందివాడ

ముందు డబ్బు చెల్లించాకే..

సబ్సిడీ సిలిండర్‌ను బుక్ చేసుకున్న తరువాత ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ తెస్తారు. ఆ సమయంలోనే డెలివరీ బాయ్‌కి సిలిండర్ ధర చెల్లించాలి. ఆ తరువాతే లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాలోకి నగదును జమ చేస్తారు. జిల్లాలో 5.33 లక్షల బియ్యం కార్డుదారులు, 6.17 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు విధించిన నిబంధనల మేరకు.. డేటా బేస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానం చేసింది. అర్హులైతే.. బుక్ చేసిన వెంటనే మీరు అర్హులు.. మీకు సబ్సిడీ జమ అవుతుందని మెసేజ్ పంపుతారు. గ్యాస్ డెలివరీ అవగానే 48 గంటల్లో బ్యాంకు ఖాతాకు నగదు జమ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఉచిత ఇసుక విధానం అమలుకు పటిష్ట చర్యలు

కలెక్టర్ బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక విధానం కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లో జేసీబీ, పొక్లెయిన్ వంటి యంత్రాలను ఉపయోగించకూడదని, కేవలం మనుషులతో మాత్రమే తవ్వకాలను చేపట్టాలన్నారు. ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘించిన వారి యంత్రాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక తవ్వకాలకు స్థానికులకే అవకాశం కల్పించేలా చూడాలన్నారు. నదీ కట్టకు ఎలాంటి హాని కలగకుండా ఉండేందుకు కట్ట నుంచి 200 మీటర్ల అవతల తవ్వకాలు జరిగేలా చూడాలన్నారు. ఇందుకు గ్రామ సర్వేయర్ల సహకారంతో స్థానిక తహసీల్దార్లు ఇసుక తవ్వకాల ప్రాంతాల్లో మార్కింగ్ చేయాలన్నారు. ఒకే ప్రాంతంలో నిరంతరంగా ఇసుక తవ్వి భారీ గుంతలు ఏర్పడటానికి అవకాశం లేకుండా చూడాలన్నారు. అవసరం మేరకు మాత్రమే ఇసుకను తీసుకువెళ్లాలని అలా కాకుండా వ్యాపార ధోరణితో ట్రాక్టర్లతో ఎక్కడైనా ఇసుకను నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఆర్డీవోలు, ఎంపీడీవోలతో కూడిన డివిజన్, మండలస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జేసీ గీతాంజలి శర్మ, ఏఎస్పీ బి.సత్యనారాయణ, ఆర్డీవోలు కె.స్వాతి, బీఎస్ హేళషారోన్, మైన్స్ ఏడీ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ గంగయ్య, డీపీవో జె.అరుణ, డ్వామా పీడీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



● వెలుగుల రవళి...దీపావళి

జీవన గమనంలో ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ప్రజలు తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను పాటించక మానరు. ఇక హిందువుల ముఖ్య పండుగలో ఒకటైన దీపావళి అయితే చెప్పనక్కరలేదు. ఈ పండుగను మతాలకతీతంగా ఆబాలగోపాలం ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. నేడు ప్రజలు దీపావళి పండుగను దివ్య కాంతులతో శోభాయమానంగా జరుపుకొనేందుకు సమాయత్తమయ్యారు. తతతనగరవాసులంతా పూలు, ప్రమిదలు, బాణసంచా కొనుగోళ్లతో బిజీబిజీగా ఉన్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

టీడీపీ నేతల అరాచకం

- రాత్రి వేళ అపార్ట్‌మెంట్‌లో చొరబడి హల్‌చల్
- ఓ కుటుంబంపై మూకుమ్మడి దాడి
- కేసు స్వీకరించేందుకు ముఖం చాటేసిన పోలీసులు
- ఎస్పీని కలిసి ఘటన వివరించిన బాధితులు



అపార్ట్‌మెంట్ లోపలకు వెళుతున్న టీడీపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: తెలుగుదేశం పార్టీ నాయకులు దుర్మార్గానికి తెగబడ్డారు. భార్యాభర్తల గొడవ విషయంలో తల దూర్చి కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. కేసు కోర్టులో ఉన్నప్పటికీ రాత్రివేళ అపార్ట్‌మెంట్‌లోని ఇంట్లోకి చొరబడి మూకుమ్మడిగా దాడి చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉందంటూ హల్‌చల్ చేస్తూ దాడికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంలో కలెక్టరేట్ వెనుక ఉన్న అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఓ కుటుంబంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడి దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. నగరంలో రామానాయుడుపేటకు చెందిన టీడీపీ నాయకుడు వాడపల్లి మహేష్ కుమార్తెకు గాంధీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న నూకల బాబూరావు కుమారుడికి కొంత కాలం క్రితం వివాహం జరిగింది. వివాహమైన కొంతకాలానికి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో ఇరు కుటుంబాల మధ్య దూరం పెరిగింది. ఈ వివాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకుడు వాడపల్లి మహేష్ కుటుంబ సభ్యులు, కొంతమంది టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు, నాయకులతో కలిసి బాబూరావు ఇంటిపై మూకుమ్మడి దాడి చేశారు. బాబూరావు కుటుంబ సభ్యులను దుర్భాషలాడటంతో పాటు దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన సీసీ పుటేజీ దొరకకూడదని సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ కొన్ని సీసీ కెమెరాల్లో నాయకులు అపార్ట్‌మెంట్‌లో ప్రవేశించటం, బయటకు వెళ్లటం మాత్రం రికార్డు అయింది. ఘటన అనంతరం బాబూరావు చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించకపోవటంతో బుధవారం ఉదయం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వారంతా ఎస్పీ ఆర్.గంగాధరరావును కలిసి జరిగిన సంఘటనను వివరించినట్లు సమాచారం. అయితే ఈ కేసును చిలకలపూడి సీఐకు రిఫర్ చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదులో పోలీసులు నాయకుల పేర్లు తప్పించి ఒకరిద్దరి పేర్లు నమోదు చేస్తామని బాధితులకు చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఘటనపై చిలకలపూడి సీఐ అబ్దుల్ నబీని 'సాక్షి' వివరణ కోరగా బాధితులు ఘటన విషయం చెప్పారని, అయితే ఇంతవరకు ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేస్తామన్నారు.

ప్రైవేటు వసతి గృహాలపై పర్యవేక్షణ పూజ్యం

- అనధికారికంగా హాస్టళ్లను నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాలలు
- తమ పరిధిలో లేవంటున్న జిల్లా విద్యా, పోలీసు శాఖలు
- విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కళాశాలల యాజమాన్యాలు
- తరచూ ఆత్మహత్యలు, ఘర్షణలు జరుగుతున్నా పట్టని ప్రభుత్వం
- యాంటీ ర్యాగింగ్, ఇతర భద్రత చర్యలు శూన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్న హాస్టళ్లపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది. దాంతో ఆయా హాస్టళ్లలో కొనసాగుతున్న విద్యార్థుల పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయి. ఇటీవల గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ఘటనతో ఉమ్మడి కృష్ణాజిల్లానే కాకుండా యావత్ రాష్ట్రం ఉలిక్కిపడింది. తరచుగా వివిధ హాస్టళ్లలో కొనసాగుతున్న ఆత్మహత్యల పర్వం ఆయా విద్యాసంస్థల్లో దిగజారుతున్న పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. దానికితోడు గాలి వెలుతురు లేని పిచ్చుకగూళ్లలా ఉన్న హాస్టళ్ల వ్యవహారంపై ఏ ప్రభుత్వ శాఖ పట్టించుకున్న పాపాన పోవటం లేదు. ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులే కాకుండా ఇంజినీరింగ్ వంటి వృత్తి విద్యా కోర్సులను అందిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు చాలా వరకూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో హాస్టళ్లను నిర్వహిస్తున్నాయి. వాటిలో చాలా వాటికి కనీస అనుమతులు లేవని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. హాస్టళ్లపై ప్రభుత్వానికి చెందిన ఏ ఒక్క శాఖకు అజమాయిషీ లేదు.

500 కళాశాలలు.. 100కు పైగా మహిళా హాస్టళ్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రభుత్వ నివేదికల ప్రకారం 30 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. 80 వరకూ డిగ్రీ కళాశాలలు, మరో 25 వరకూ నర్సింగ్, బీఈడీ కళాశాలలు ఉన్నాయి. వాటితో పాటుగా సుమారు 300 వరకూ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అవి కాక ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు కూడా ఉన్నాయి. ఇంటర్మీడియెట్ ఆపై కోర్సులను అభ్యసిస్తున్న విద్యాసంస్థలకు సంబంధించి 125 నుంచి 150 వరకూ హాస్టళ్లు ఉమ్మడి కృష్ణాజిల్లాలో కొనసాగుతున్నాయి. హాస్టళ్ల అనుమతులు తమ పరిధిలో లేవంటున్నాయి జిల్లాలోని విద్యా, పోలీసు శాఖలు. విద్యాసంస్థలు, వాటి ప్రాంగణాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ చిన్నచిన్న భవనాలను అద్దెకు తీసుకొని పలు చోట్ల హాస్టళ్లను నిర్వహిస్తున్నాయి.

ఏదేని ఘటన జరిగినప్పుడే హడావుడి

ఏదైనా సంఘటన జరిగి విద్యార్థులకు అనుకోని భారీ నష్టం జరిగినప్పుడు మాత్రమే పోలీసు శాఖ స్పందించి హడావుడి చేస్తుందని విద్యార్థి సంఘాలు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కనీసం పోలీసులు తమ పరిధిలో ఇన్ని హాస్టళ్లు ఉన్నాయి, వాటికి అనుమతులు ఉన్నాయా లేదా అని పోలీసులు స్పష్టంగా చెప్పలేక పోతున్నారని అంటున్నారు.

క్రమశిక్షణ కమిటీలు కాగితాలకే పరిమితం

హాస్టళ్లలో యాంటీ ర్యాగింగ్‌తో పాటుగా ఇతర క్రమశిక్షణకు సంబంధించిన కమిటీల అవసరం ఉంటుంది. కళాశాలల్లో ఈ విధమైన కమిటీల ఏర్పాటుకు అప్పుడప్పుడు పోలీసు శాఖ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటోంది. కళాశాలలు సైతం పోలీసులు సూచించిన కమిటీలను వేసి వాటిని కాగితాలకే పరిమితం చేస్తున్నాయి. కనీసం ఒక్కసారి కూడా ఆ కమిటీలు సమావేశమై చర్చించిన దాఖలాలు లేవు. విద్యార్థులు తరచుగా ఆత్మహత్యలకు పాల్పడుతూ విలువైన జీవితాలను బలి చేసుకుంటున్నారు. అందులోనూ విద్యార్థినుల హాస్టళ్ల విషయంలో పరిస్థితులు మరింత ఘోరంగా ఉన్నాయని ఇటీవల చోటు చేసుకుంటున్న ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

అమరుల త్యాగాలు అజరామరం



క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

మచిలీపట్నంలో పోలీసుల క్యాండిల్ ర్యాలీ

కోనేరుసెంటర్: పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి మచిలీపట్నంలో జిల్లా పోలీసులు అమరవీరులను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీటాకీస్ సెంటర్ నుంచి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లోని పోలీసు అమరవీరుల స్థూపం వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు పాల్గొని మాట్లాడుతూ ప్రజా స్వామ్య పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పోరాడి అశువులుబాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ ఈ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాంటి త్యాగనిరతులకు పోలీసుశాఖ తరపున నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు సతీష్, రవికిరణ్, రాఘవయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



చిలకలపూడి(మచిలీపట్నం): దీపావళి పండుగ ప్రతి ఇంటా వెలుగులు నింపాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకె బాలాజీ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలంటూ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇటీవల విజయవాడ రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ దుండగుడి దాడిలో మృతిచెందిన లోకోపైలట్ ఎబినేజర్ కుటుంబానికి అతని మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన ఎబినేజర్ క్లాస్‌మేట్స్, మిత్రులు బుధవారం విజయవాడ వచ్చి ఎబినేజర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఎబినేజర్ భార్యకు రూ.1.20లక్షలను ఆర్థికసాయంగా అందజేశారు. లోకోపైలట్ విజయ్‌కుమార్, మిత్రులు సాయిరాము తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం



హరీష్

కంచికచర్ల: బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పరిటాల అండర్‌పాస్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బి.రాజు కథనం మేరకు..కంచికచర్ల అంబేద్కర్ నగర్‌కు చెందిన హరీష్(24) మూలపాడులో వ్యక్తిగత పనులు ముగించుకుని తిరిగి బైక్‌పై వస్తుండగా పరిటాల ఫ్లైఓవర్ అండర్‌పాస్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈఘటనలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుకాసురులు

- యనమలకుదురులో ఇసుక దోపిడీ
- నిషేధ క్వారీలో యంత్రాలతో తవ్వకాలు
- నిత్యం 70 ట్రాక్టర్లతో ఇసుక తరలింపు
- టీడీపీ నేతలకే ఉచిత ఇసుక పథకం

పెనమలూరు: నిషేధిత యనమలకుదురు ఇసుక క్వారీలో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. టీడీపీ నాయకుల అండదండలతో విజయవాడకు కూతవేటు దూరంలో ఇసుకమాఫియా పేట్రేగిపోతున్నా..అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తిచూడటం లేదు. ఇసుక మాఫియా ఇక్కడ్నుంచి భారీగా ఇసుకను తరలిస్తూ సొమ్ముచేసుకుంటుండగా, టీడీపీ నేతలు అక్రమార్కులకు సహకరిస్తూ ఇసుకను కాజేస్తుండటం గమనార్హం.

పొంచి ఉన్న ప్రమాదం..

కృష్ణానదిపై కనకదుర్గ వారధి నిర్మాణం పూర్తయిన తర్వాత దశాబ్దకాలం కిందట యనమలకుదురు క్వారీని ప్రభుత్వం నిషేధిత క్వారీగా ప్రకటించింది. అప్పట్నుంచి ఇక్కడ ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అయితే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక యనమలకుదురు క్వారీలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ ఇసుక అక్రమ తవ్వకాలతో కనకదుర్గవారధితోపాటు యనమలకుదురు గ్రామానికి కూడా ప్రమాదం పొంచి ఉంది.

నేతలకే ఉచిత ఇసుక పథకం!

ఈ క్వారీ నుంచి నిత్యం 70ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను బహిరంగమార్కెట్‌లో రూ.7వేలకు అమ్ముతున్నారు. ఇలా ఇసుకను తరలిస్తున్న ప్రతి ట్రాక్టర్ కూడా రోజుకు ఒక ట్రిప్ ఇసుకను టీడీపీ బడానేతకు ముడుపుగా చెల్లిస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్ కూడా అయిన సదరు టీడీపీ బడానేత తాను చేస్తున్న కాంట్రాక్టు పనులకు ఈ ఉచిత ఇసుక పథకాన్ని ఉపయోగించుకుంటుండటం గమనార్హం. యనమలకుదురుకు చెందిన మరో టీడీపీ నాయకుడు తాను నిర్మించే అపార్ట్‌మెంట్ పనులకు సైతం ఈ ట్రాక్టర్ల ద్వారానే ఇసుకను ఉచితంగా పొందుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా నిబంధనలకు విరుద్ధంగా యనమలకుదురు క్వారీ నుంచి సాగుతున్న ఇసుక అక్రమరవాణాను నేతలు సైతం సొమ్ముచేసుకుంటున్నారు. ఈ ఇసుక అక్రమరవాణాకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయకపోతే బుడమేరు వరద సీన్ భవిష్యత్‌లో యనమలకుదురుకు తప్పదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నిషేధిత క్వారీ నుంచి యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.



నిషేధిత యనమలకుదురు క్వారీలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమరవాణా

యథేచ్ఛగా ఇసుక డంప్‌లు

పెనుగంచిప్రోలు/వత్సవాయి: ఇసుక అక్రమ రవాణా మూడు టిప్పర్లు..ఆరు లారీల్లా కొనసాగుతోంది. అధికార టీడీపీ నాయకులు ఇసుకదందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో భారీగా నిల్వచేసిన ఇసుక డంప్‌లే ఈ అక్రమ ఇసుకదందాకు నిదర్శనం. మునేరు నుంచి ఇసుక అక్రమ రవాణాను టీడీపీ నాయకులు ప్రధాన ఆదాయవనరుగా మార్చుకుని జేబులు నింపుకుంటున్నారు. పగలు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేస్తూ ఖాళీ స్థలాలు, తోటల్లో డంప్ చేసి రాత్రుళ్లు గుట్టు చప్పుడు కాకుండా తెలంగాణాతోపాటు ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు సైతం కేవలం కొన్ని డంప్‌లు మాత్రమే స్వాధీనం చేసుకుంటూ మరికొన్ని డంప్‌లను చూసిచూడనట్లు వదిలివేస్తున్నారు.

ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు...

ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు నిర్దేశించిన నిబంధనలేవి ఆచరణలో అమలుకావడం లేదు. మంచి నీటి పథకాల సమీపంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. కూలీలకు బదులుగా జేసీబీ, పొక్లెయిన్లతో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో మంచినీటి పథకాలతోపాటు పంటపొలాలు సైతం దెబ్బతింటున్నాయి. పెనుగంచిప్రోలు రెవెన్యూ పరిధిలోని మునేరులో నిబంధనలు పాటించకుండా సాగుతున్న ఇసుక తవ్వకాల కారణంగా పంటపొలాలు దెబ్బతింటున్నాయంటూ అనిగండ్లపాడు గ్రామ టీడీపీ నాయకులు, గుమ్మడిదుర్రు మాజీసర్పంచి పొన్నం రంగారావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



మక్కపేట కాలనీలో డంప్ చేసిన ఇసుక

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుప్రజ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు సేవాభావంతో పనిచేయడం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకుంటారని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఇ.సుప్రజ పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఏసీబీ, కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఉద్యోగులకు అవినీతి నిర్మూలనపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ' అనే కాన్సెప్ట్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఇ.సుప్రజ మాట్లాడుతూ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. అవినీతి నిర్మూలనకు టోల్ ఫ్రీ నంబరు 1064, 9440440057కు ఫోన్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత మాట్లాడుతూ కొందరు అధికారుల అవినీతి కారణంగా దేశ ప్రగతి వెనుకబడుతోందన్నారు. అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రజలు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులతో అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు జీవీవీ సత్యనారాయణ, ఎవీఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ దేవినేని అవినాష్

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి కేసులు పెడుతున్నారని, ఇందుకు రానున్నకాలంలో తగినమూల్యం చెల్లించుకోక తప్పదని ఆపార్టీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ దేవినేని అవినాష్, నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హెచ్చరించారు. ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా టీడీపీ నాయకులు దాడిచేయడంతోపాటు తిరిగి కేసులు పెట్టడంతో జైలుపాలై బెయిల్‌పై విడుదలైన వైఎస్సార్‌సీపీ నాయకులు పరిటాల రాము, వీరభద్రరావు తదితరులను బుధవారం వారు పరామర్శించారు. అధైర్యపడవద్దని..అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈసందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగున్నర నెలలైనా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. గ్రామాల అభివృద్ధికి కృషిచేయకుండా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి తిరిగి పోలీసులతో కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారని మండిపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. కంచికచర్ల, నందిగామ ప్రాంతాల్లో రీచ్‌లను దక్కించుకున్న కూటమి నాయకులు భారీగా ఇసుకను దోపిడీ చేస్తున్నారన్నారు. స్టాక్ యార్డుల్లోని లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను దోచుకుని ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం చేశారన్నారు. మద్యం బెల్ట్‌షాపుల ఏర్పాటుతో అధికధరలకు మద్యాన్ని విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు చేసిందేమి లేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పరామర్శించిన వారిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థి పూనూరు గౌతంరెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, మాజీఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, అంగడాల పూర్ణచంద్రరావు, రాయల నరసింహారావు, బి.సుబ్బారావు ఉన్నారు.



పరిటాల రాము, కార్యకర్తలను పరామర్శిస్తున్న దేవినేని అవినాష్, డాక్టర్ ఎం.జగన్‌మోహనరావు

లఘుచిత్రాల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నవంబర్ 13వతేదీన హైదరాబాద్‌లో నిర్వహించే బాలల లఘుచిత్రాల పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రెయిన్ బో చిల్డ్రన్ ఫిలిం సొసైటీ కార్యదర్శి కె.మోహన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 18ఏళ్ల లోపు బాలకళాకారులే ఈ లఘుచిత్రాల పోటీల్లో నటించాలని, చిత్రాల నిడివి 5 నుంచి 15 నిముషాల లోపు ఉండాలన్నారు. ఎంట్రీ ఫీజుగా రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను మోహన్‌ఫిల్మ్అకాడమీఃజీమెయిల్.కామ్ అనే మెయిల్ ఐడీకి నవంబర్ 7వ తేదీలోపుగా పంపాలని సూచించారు. దాశరథి ఫిలిం సొసైటీతో కలిసి సంయుక్తంగా ఈపోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల విజేతలకు నవంబరు 14వ తేదీన ముగింపు సభలో నగదు బహుమతులు అందచేస్తామని వివరించారు. ఇతర వివరాలకు సెల్‌నంబరు 89782 51150లో సంప్రదించాలని ఆయన కోరారు.

లారీ ఢీకొని ఇద్దరు కూలీలు దుర్మరణం

పామర్రు:విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిలో పామర్రు పరిధిలోని కంచర్లవానిపురం అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఇద్దరు తాపీ కూలీలు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు..అంగలూరుకు చెందిన సయ్యద్ అబ్దుల్‌ఖాదర్(48), రహమాన్‌బేగ్(38) కంచర్లవానిపురానికి దగ్గరలోని ఓ మిల్లు వద్ద తాపీపనికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో వారు బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తూ జాతీయ రహదారిని దాటుతుండగా, మచిలీపట్నం నుంచి విజయవాడ వైపునకు వస్తున్న లారీ వేగంగా వచ్చి వీరిని ఢీ కొట్టింది. దీంతో ఎగిరి డివైడర్‌పై పడిన వీరిద్దరూ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. లారీడ్రైవర్ వెంటనే పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పామర్రు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

నిడమర్రులో పేలుడు

ముగ్గురికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన శివ

కృత్తివెన్ను: పేలుడు సంభవించి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన కృత్తివెన్ను మండలం నిడమర్రు దళితవాడలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. రెవెన్యూ అధికారుల కథనం మేరకు... చెరువులపై కొంగలు, పిట్టలను కొట్టేందుకు నెల్లూరుకు చెందిన శివ, నిడమర్రుకు చెందిన కర్రి నాగమల్లేశ్వరరావు కలసి మందును తయారుచేస్తున్నారు. ఈక్రమంలో వర్షం రావడంతో మందును ఇంటిలోకి చేరుస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో వీరిద్దరితోపాటు మందుల తయారీని చూసేందుకు వచ్చిన తొమ్మిదేళ్ల బాలుడు కర్రి తేజ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్సనిమిత్తం క్షతగాత్రులను స్థానికులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తేజ కళ్లకు తీవ్రంగా గాయలైనట్లు సమాచారం. శివ, నాగమల్లేశ్వరరావు కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం వీరిద్దరిని విజయవాడ తరలించినట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలాన్ని బందరు డీఎస్పీ అబ్దుల్‌సుబాన్, తహశీల్దార్ సోమేశ్వరరావు పరిశీలించారు. క్లూస్ టీం కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్ఐ పైడిబాబు తెలిపారు. అయితే అడవి పందుల వేట కోసం నాటుబాంబులు తయారుచేసి భద్రపరిచే క్రమంలో ఈ భారీ పేలుడు సంభవించిందనే గుసగుసలు స్థానికంగా వినిపిస్తుండగా, దీపావళి మందులు జాగ్రత్త చేసుకునే క్రమంలో ఈ పేలుడు చోటుచేసుకున్నట్లు పోలీసులు చెబుతుండటం గమనార్హం.

ప్రణాళిక లక్ష్యాల సాధనపై సమీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో వివిధశాఖల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వందరోజుల ప్రణాళికా లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ డీకె బాలాజీ ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకోసం వందరోజుల ప్రణాళిక లక్ష్యాల్లో ఇప్పటివరకు సాధించిన పురోగతిపై కలెక్టర్ సమావేశ హాలులో బుధవారం ఆయన ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద కేంద్రాలను పటిష్టంగా అమలుచేసేందుకు అప్రోచ్‌రోడ్లు, విద్యుత్ సరఫరా పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు.పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని నూరుశాతం విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఫాంపాండ్స్, హార్టికల్చర్, ప్లాంటేషన్, ఉపాధిహామీలో రోడ్డు పనులకు సంబంధించి బిల్స్ అప్‌లోడ్ చేస్తే డబ్బులు త్వరగా వస్తాయని అధికారులకు సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్‌షాపులను భర్తీ చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు సంబంధించి జిల్లాలో మొదటివిడతగా 37,765 మంది రైతులకు రూ. 56.70కోట్లు, రెండోవిడతలో 2,294 మందికి రూ.3.21కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. జేసీ గీతాంజలిశర్మ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే శిలాఫలకాల్లో ప్రోటోకాల్ నిబంధనలను పాటించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవోలు కె.స్వాతి, షారోన్, జి.బాలసుబ్రహ్మణ్యం, డీఎస్‌వో వి.పార్వతి, డీపీవో జె.అరుణ, డ్వామా పీడీ శివప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డీకె బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ

పింఛన్ల పంపిణీ ఏర్పాట్లపై ఆరా..

చిలకలపూడి(మచిలీపట్నం): నవంబరు 1వ తేదీన పింఛన్లను లబ్ధిదారులకు సజావుగా పంపిణీ చేయాలని కలెక్టర్ డీకె బాలాజీ ఆదేశించారు. జిల్లాలోని క్షేత్రస్థాయి అధికారులతో పింఛన్ల పంపిణీ ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసినదీ లేనిదీ ఆరా తీశారు. నగదును డ్రాచేసి జాగ్రత్తగా భద్రపరిచి ఒకటోతేదీ ఉదయం ఐదు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలోని 2,38,249మంది పింఛన్‌దారులకు రూ. 101.09కోట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసుకుని పింఛన్ల పంపిణీని పర్యవేక్షించాలని ఆదేశించారు. డీపీవో జె.అరుణ, డీఆర్డీఏ కార్యాలయ సూపరింటెండెంట్ డి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్లు ఎంపిక

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో పురుషులు, మహిళల జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ సెలక్షన్స్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య ప్రారంభించగా, జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో చక్కటి క్రీడా నైపుణ్యం కనబరిచి జిల్లాకు పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, రిటైర్డ్ పీడీ టీఎస్ఆర్‌కె. ప్రసాద్, బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎం.మురళీకృష్ణ, కార్యనిర్వాహకకార్యదర్శి ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు డి.నాగరాజు, ఎస్‌కె.మీరాసాహెబ్, వెంకట్రావు పాల్గొన్నారు.

పురుషుల జట్టు వివరాలు..

ఎస్.సాయికృష్ణ, బి.శివనాగరాజు, కె.భాగ్యరాజు, డి.నరేష్, ఎస్ఎల్‌వీడీ.కిరణ్, జి.వంశీదుర్గాప్రసాద్, బీఎస్ఎన్.ప్రభు, కె.శ్రీను, జి.రామాంజనేయుడు, బి.జగదీష్.

స్టాండ్ బై: పి.కార్తీక్, కె.జస్వంత్, ఎం.సాగర్‌రెడ్డి.

బాలికల జట్టు వివరాలు..

కె.మౌనిక, బి.సాయిలత, పి.భవాని, పి.సాహితి, కె.సరస్వతి, కె.ఉమామహేశ్వరి, కె.మాధవి, ఆర్.రక్షిత, సిహెచ్.కనకదుర్గ, పి. మౌనికాంజలి.

స్టాండ్ బై: సవాంగ్, జి.స్రవంతి, వినూషా.



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు

మినీవ్యాన్ డ్రైవర్ మృతి



మృతుడు రామ చంద్రరావు(ఫైల్)

ఉంగుటూరు: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మినీవ్యాన్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఆత్కూరు పోలీసుల కథనం ప్రకారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం అట్లపాడు గ్రామానికి చెందిన వల్లూరికోట రామచంద్రరావు(41) మినీ వ్యానులో కొబ్బరి బోండాల లోడుతో విజయవాడ వెళ్తున్నాడు. ఉంగుటూరు మండలం పొట్టిపాడు టోల్‌గేట్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి సుమారు 12గంటల సమయంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజా మత్తుజగ ఎటువంటి సిగ్నల్‌ను వేయకుండా తనలారీని రోడ్డుపైన పార్క్ చేసి వెళ్లాడు. అదే సమయంలో కొబ్బరిబోండాల లోడుతో విజయవాడ వెళ్తున్న రామచంద్రరావుకు దగ్గరకు వచ్చే వరకు ఆగి ఉన్న లారీ కనిపించకపోవడంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రామచంద్రరావు మినీవ్యాన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు కలిసి అతన్ని బయటికి తీసి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు తమిళనాడు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.



పొట్టిపాడు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న మినీవ్యాను

డీఎంఈ కార్యాలయంలో అగ్నిప్రమాదం

సాక్షి, అమరావతి: విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని డీఎంఈ కార్యాలయంలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఉదయం 9 గంటల సమయంలో డీఎంఈ ఛాంబర్‌లోని ఏసీ యూనిట్‌లో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. అగ్ని కీలలు సోఫాపై పడటంతో మంటలు వ్యాపించాయి. విధుల్లో ఉన్న శానిటేషన్ సిబ్బంది కేకలు వేయడంతో అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. ఫైరింజిన్‌తో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు.

క్రీడా వార్తలు


ఉమ్మడి కృష్ణాజిల్లా హాకీ జట్ల ఎంపిక



ఉమ్మడి కృష్ణా జిల్లా హాకీ అండర్-17 బాలుర, బాలికల జట్లతో హాకీ సంఘం సభ్యులు

పమిడిముక్కల: ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి హాకీ జట్లను పమిడిముక్కల హైస్కూల్‌లో బుధవారం ఎంపిక చేశారు. ఈ ఎంపికల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–17 విభాగంలో 18మంది బాలురు, 18మంది బాలికలు, అండర్–14 విభాగంలో 18మంది బాలురు, 18 మంది బాలికలతో కూడిన జట్లను ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటనారాయణ తెలిపారు. అండర్–17 జట్టు నవంబర్ 3నుంచి నెల్లూరు జిల్లాలో, అండర్–14జట్లు 7వతేదీ నుంచి అనకాపల్లి జిల్లా నక్కపేటలో రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొంటాయని ఆయన వివరించారు. ఎంపీడీఓ విఠల్‌పాల్, ఎస్ఐ శ్రీను, కృష్ణాజిల్లా హాకీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సన్నిధి నాగసాయి శ్రీనివాస్, హరికృష్ణ, హెచ్ఎం కేశవనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు



స్కేటింగ్ పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడస్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణాజిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు భవానిపురంలోని రోజ్ పార్క్‌లో బుధవారం ఉత్సాహభరితంగా సాగాయి. కృష్ణాజిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఇన్‌లైన్, క్వాడ్ స్పీడ్ స్కేటింగ్ విభాగంలో క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. 5-7, 7-9, 9-11, 11-14, 14-17, 17ఏళ్ల పైబడిన విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఒక్కో వయసు కేటగిరీలో 20 మంది(ఇన్‌లైన్, క్వాడ్ విభాగాల్లో) మందికి ట్రోఫీలు అందజేశారు. పోటీల అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టుకు ఎంపికైన 120 మంది క్రీడాకారుల జాబితాను ప్రకటించారు. ముగింపు కార్యక్రమంలో ఏపీ రోలర్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి పి.థామస్, కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, రోజ్ గార్డెన్ పార్క్ అధ్యక్షకార్యదర్శులు నర్సారెడ్డి, వి.ఎస్.కె.ప్రసాద్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ దుర్గాప్రసాద్, అధ్యక్షకార్యదర్శులు దుర్గాప్రసాద్, శ్రీనివాసరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి బచ్చు మురళీ, కోశాధికారి భువన్ పాల్గొన్నారు.